# పుట్టిన పండుగ

పేరేమిటని ఆ అమ్మాయిని అడిగితే 'శేష మాంబ' అంటుంది. పూర్తి పేరు చెప్పమంటే ఇంటి పేరుతో సహా 'వేంకట కనక దుర్గ లక్ష్మీ సరస్వతీ శేషమాంబ' అంటుంది. కాని, అందరూ శేషూ అని పిలుస్తారు.

నేను సందు మలుపు తిరిగేటప్పటికి వీధి అరుగు మీద నుంచుని దిక్కులు చూస్తున్న వేంకట కనక దుర్గ లక్ష్మీ సరస్వతీ శేషమాంబ కనిపించింది. చేపల్లాటి ఆమె కళ్లు (ఆమె వింటే ఊరుకోదు; 'నా కళ్లని చేపలతోనూ కోడిగుడ్లతోనూ పోలుస్తావా?' అంటూ కలహానికి సిద్ధమవుతుంది.) ఏమిటో అన్వేషిస్తున్నాయి. ఆత్రుత ఆమె ముఖ మండలంలో ముద్ర వేసినట్లు అగుపిస్తోంది.

నన్ను గమనించగానే ఆమె మొహం విప్పారింది. "మామయ్యా, ఎక్కడికి వెళ్తున్నావ్?" అంది.

"అదిగో! ఆ ప్రశ్నే వెయ్యవద్దని నీకు ఎన్నో సార్లు చెప్పాను. పెద్దవాళ్లని 'ఎక్కడికి వెళ్తున్నావ్?' అని ఎప్పుడూ అడక్కూడదు."

"సరేలే... నువ్వు ఎక్కడికి వెళ్తే నాకెందుకు గాని, పీచు మిఠాయి అబ్బాయి నీ కెక్కడయినా కనిపించాడా?"

లేదంటూ ముందుకి నడుస్తున్నాను, పీచుమిఠాయిల అబ్బాయిలూ మరమరాల అమ్మాయిలూ నాకెందుకు కనిపిస్తారూ!!

"మామయ్యోయ్, యివ్వాళ పీచుమిఠాయి అబ్బాయి రాలేదు సుమా!"

నాకు కాస్త ఆశ్చర్యం కలిగింది.

"పాపం! ఎంచేత రాలేదో! రోజూ రెండు గంట లయ్యేటప్పటికే విధిగా వచ్చేవాడు. ఇవ్వాళ, నాలుగయినా, యింకా రాలేదు, మామయ్యా!"

మెయిల్ ఆలస్యం అయినరోజున పత్రికల ఏజంటు కూడా అంత బాధపడడు.

"ఏం, వాడికోసం అంత బెంగపెట్టుకున్నావ్!" అన్నాను, నడివీధిలో ఆగి.

"పాపం! ఏమయిపోయాడో, ఏమయినా జబ్బు చేసిందో ఏమో అతనికి" అంది చిన్నారి శేషు.

"ఏమీ అవదు. ఏమీ జబ్బుచేసి వుండదు."

"నిజంగానా ?" అంది.

నేను ఆవేదనగానీ, బాధగానీ యింకోరు అనుభవిస్తూ వుంటే, చూస్తూ, నాకేం సంబంధం లేనట్టుగా ప్రవర్తించ లేను. వారికేదో నివారణోపాయం సూచించాలనీ, వారి బాధతగ్గించేందుకు ప్రయత్నం చేయాలనీ నా స్వభావం పురలాటపడుతుంది. ముఖ్యంగా, చిన్నపిల్లలలోని చిన్నతనపు ఆవేదనలు నా జాలిగుండెలో మరీ హత్తుకు పోతాయి. పెద్ద వారికి ఆవేదనలు ఎంత తగ్గించుదామనుకున్నా, కొద్దో గొప్పో వుంటూనే వుంటాయి. అథవా చిన్న వారయినా ఎట్టి ఆవేదనలూ లేక ఖులాసాగా కిల కిల లాడుతూ, చిలకలలా ఎగురుతూ, జింకలలా గంతులేస్తూ కాలం గడపాలని నా కోరిక

రెండు అడుగులు వెనక్కి వేసి సప్తవర్షప్రాయ అయిన శేషు తల నిమురుతూ, "ఎందుకమ్మా శేషూ వాడికోసం అలా చూస్తావ్ ! నీ కేమయినా తినాలని వుంటే కాఫీహోటల్ కి వెళ్దాం రా," అన్నాను.

ఒక్కమారు ఆమె ముఖంలో ఉత్సాహ దేవత ఎన్నో భంగిమలలో నృత్యం సలిపింది.

"అమ్మ ఏమయినా అంటుందేమో! వచ్చిన తర్వాత కొడితే... ..."

దూరదృష్టికి మెచ్చుకుంటూ, "కొట్టదులే,— నేను చెప్తాను కాసూ," అన్నాను.

ఇద్దరమూ కబుర్లు చెప్పుకుంటూ నడవడం మొదలెట్టాం. దారిలో అంది శేషు: "మామయ్యా, ఇవ్వాళ మాయింట్లో ఒక గమ్మత్తు చేసుకున్నాం. ఏమిటో చెప్పుకో ఛ'

"తినేందుకు పెట్టనిదే నాకెలా తెలుస్తుంది?"

"ఇంతేనా మరి! అన్ని పుస్తకాలు చదువు తావ్—ఈ మాత్రం చెప్పుకోలేవు?"

"ఊహూ."

"నేను చెప్పనా?"

"ఊఁ."

"మైసూర్ పాక్. రేపు నాన్న పుట్టిన పండగ. అంచేత అమ్మ తయారు చేసింది."

"నువ్వు తిన్నావా?"

"ఊఁ."

"అయితే, యిప్పుడు కాఫీహోటల్‌లో మళ్లీ జిలేబీలు తింటే జబ్బు చెయ్యదా?"

శేషు చక్కగా తప్పుకుంది.

"అమ్మ నాకు రుచి చూడ్డానికే పెట్టింది. తినేందుకు పెట్టలేదు. తినేందుక్కూడా పెట్టమని అడిగితే తిట్టింది. పండగ రేపట—యివ్వాళ తిన కూడదట. అయితే ముందుగా చేసుకోవడం ఎందుకో నాకు తెలీక అడుగుతున్నాను. మైసూర్ పాక్ చూస్తూవుంటే నాకు నోరూరుతుంది; చేస్తున్నవాళ్ళకి నోరూరదు, మామయ్యా?"

"ఊహూ. పెద్దవాళ్ళకి అంత తిండి చాపల్యం వుండదు."

"అలాగా!" అంది శేషు, ఆ విషయాన్ని తను నమ్మలేనట్టుగా.

హోటల్లో ప్రవేశించబోతూ వుండగా మమ్మల్ని ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నట్లుగా హోటల్ యజమాని చిరునవ్వు నవ్వాడు. ఇంతలో, త్రేణుస్తూ బయటికి వస్తున్న ఒక యినస్సారెన్సు పెద్దమనిషి గేటు దగ్గిరే నన్ను కబుర్లలోకి దింపాడు. ఆ అయిదు నిముషాల బాతాఖానీలో జాతీయ అంతర్జాతీయ విశేషాలు ఎన్నో దొర్లి పోయాయి. పృథ్వినంతా ఒక్కసారి గాలించేశాం. నేను ఆయన్ని వొదిలించుకుని లోపలికి వెళ్ళే సమయానికి శేషు తన కృషిలో పూర్తిగా నిమగ్నమై

వుంది. ఆమెకి ఎదురుగావున్న కుర్చీలో నేను ఆసీ
నుణ్ణి అవగానే చెప్పింది.

"మామయ్యా, ఒక జిలేబీ తీసుకురమ్మన్నాను. దాని రుచి నాకేం తెలీదు. ఇంకోటి తీసుకురమ్మన్నాను. జిలేబీలు ఏమీ బావుండా లేవు, మామయ్యా! నాకో బెనారెస్ కాజా తెప్పించు," అంది.

నేను తెప్పించేదేముంది, ఆమె అడగడమే తడవుగా సప్లయిచేసేందుకు సిద్ధంగా వున్నాడు, రాను బంటులాంటి సర్వర్.

నేను వోవల్‌టిన్ తీసుకురమ్మని సర్వర్‌తో చెప్పగా, తనుకూడా వోవల్‌టిన్ కావాలని చెప్పింది. ఆయాసపడుతూ కప్పులో సగం మాత్రం తాగగలిగింది. మిగతా సగమూ వదల్లేక వదల్లేక వదిలింది.

"మామయ్యా, ఈ వదిలేసిన సగానికికూడా మనం డబ్బు యివ్వవలసిందేనా!"

"ఇవ్వాలి."

"అయితే, యిదికూడా ఎలాగో అలా తాగెయ్యనా ?"

వద్దన్నాను,—వమనం చేసుకుంటుందేమో అని భయపడుతూ.

బిల్లు చెల్లిస్తూ వుండగా హోటల్ యజమాని శేషుని వుద్దేశించి అన్నాడు.

"అమ్మాయిగారు ఈ మధ్య రావడం లేదు."

మామయ్య తీసుకొస్తావుంటే తన కేం ఆటంకం వుందన్నట్టుగా నా మొహం కేసి చూసింది శేషు.

ఇంటికి వస్తున్నాం.

"నీపుట్టినపండక్కి మీయింట్లో ఏం చేస్తారు, మామయ్యా ?"

"ఏమీ చెయ్యరు. అన్నం వండుకు తింటారు."

"మరి, నువ్వు కొత్తబట్టలు కుట్టించు కుంటావా ?"

"ఊహు."

"మరి, మానాన్న ఎందుకు కుట్టించు కున్నాడూ ?"

"మీనాన్న చిన్నపిల్లాడు."

"లేదు, నువ్వే చిన్నవాడివి. నాకు ఆమాత్రం తెలీదనుకున్నావా! నాన్న జుట్టంతా నెరిసి పోయింది. నీ జుట్టు యింకా నెరవందే! నల్లగా, ఎంచక్కగా వుంది."

సంతోషించాను,—శేషుకివున్న ప్రపంచ జ్ఞానానికి.

"మామయ్యా, నాకో సందేహంవుంది— చెప్తావూ?"

"ఊ."

"నవ్వకూడదు. ఎవ్వరికీ చెప్పకూడదు."

ఏమిటా అని నా బుద్ధిని అడిగాను. ఎందుకో అంత తొందర! ఒక్క క్షణకాలం ఓపిక వహిస్తే శేషే చెప్తుంది కాదూ!

"నేను పెద్దా, నాన్న పెద్దా?"

అతి ప్రయాసతో నవ్వుని దాచుకో గలుగుతున్నానని శేషు గ్రహించింది.

"వెటకారం చెయ్యకు, మామయ్యా. నవ్వకు. నవ్వితే నీతో ఎప్పుడూ మాట్లాడను. నీకూ నాకూ రాంరాం. నా పుట్టినపండగ మే నెలలోవచ్చింది; నాన్న పుట్టిన పండగ జూన్ నెలలోవచ్చింది. అయితే, మరి, నేను ముందు పుట్టానా? నాన్న ముందుపుట్టాడా?"

(డిశంబరు - 40)

---